కానీ క్లాస్‌లో కూర్చుని క్లాస్‌లో ఏం చెప్తున్నామో వినకుండా మళ్ళీ బయటకొచ్చేస్తే ఏమవుతుంది? క్లాస్‌లో ఉంటారు మీరు, కానీ ఎక్కడున్న వాళ్ళు అక్కడే ఉంటారు.

- ధ్యానం చేస్తున్నప్పుడు కూడా మీరు పరిణామక్రమంలో వచ్చేటటువంటి ఈ మార్పును మీరు గమనించటం నేర్చుకోవాలి కనుక ఈ పుస్తకాలన్నీ చదవాలి మీరు.

**ఎంచేతంటే,**

పరిణామక్రమం తెలియాలి మీకు. సిలబస్ తెలియాలి.

- ఈ సిలబస్ తెలియటానికి మన వాళ్ళు 18 పురాణాలు మనకి అందించారు. ఇది సిలబస్.
- ఈ 18 పురాణాలు మనం చదవలేం కనుక ఒకొక్క పురాణానికి భగవద్గీతలో ఒకొక్క అధ్యాయము ఉన్నదనే రహస్యం కూడా చాలా మందికి తెలియదు. మీరది గుర్తుంచుకోండి.

ఒకొక్క పురాణము పరిణామక్రమాన్ని చాలా స్పష్టంగా వివరిస్తుంది. ఆ పురాణాలలో చెప్పబడినటువంటి పరిణామక్రమము టూకీగా, పాయింట్స్ టూ బీ నోటెడ్ అంటామే, మన క్లాస్‌లు అవీ చేస్తున్నప్పుడు, టెక్స్‌ట్ బుక్స్ చదువుతున్నప్పుడు ఓ 50 పేజీలో, 60 పేజీలో చదివి ఒక పాయింట్ నోట్ చేసుకుంటాం మనం. అలాగ 18 పురాణాలలో చెప్పబడిన విషయాన్ని ధ్యానము చేస్తూవున్నప్పుడు ఆ యోగస్థితిలో మీరు ఏయే పరిణామాలకు లోనవుతారో భగవద్గీత మీకు చెప్తుంది. ఆ రహస్యం మీరు గుర్తుంచుకోండి.

- అంచేత మీరు ఏం చేయాల్సి వస్తుంది? కొంచెం భగవద్గీతను కూడా చూడాల్సి వస్తుంది.

ఏమిటో సిలబస్ పెరిగిపోతోంది! కానీ ధ్యానములో తీవ్రత చెందేవాళ్ళకి ఇది సిలబస్. మిగతా వాళ్ళు అంత కష్టపడక్కర్లేదు. మిగతా వాళ్ళకి ఇంత వరకు నేను చెప్పింది చాలు.

- కానీ ధ్యాన ప్రక్రియను సవ్యముగా అవగాహన చేసుకోవాలి అనుకునేటటువంటి వాళ్ళు భగవద్గీత చదవటంతో పాటు, "సీక్రెట్ డాక్ట్రిన్" అనేటటువంటి ఒక పుస్తకం చదివి తీరాల్సిందే. ఇంకో షార్ట్ కట్ లేదు.

**ఎందుకంటే,**

సంస్కృతంలో వ్రాయబడినటువంటి ఆ పురాణాలు మనకు అర్థం కావటం మానేశాయి. అందులో వ్రాసినటువంటి విషయాలు మనకి అర్థంకావు. అంచేత సీక్రెట్ డాక్ట్రిన్‌లో పురాణాలలో చెప్పబడి నటువంటి విషయాలు చాలా స్పష్టంగా, అర్థమయ్యేటట్టుగా చెప్ప బడ్డాయి. అందులో రెండు విధాలుగా చెప్పబడింది.

**ఒకటేమిటంటే,**

సృష్టి యొక్క పరిణామక్రమము.

**రెండవది,**

మానవజాతి యొక్క పరిణామక్రమము.

రెండూ నేర్చుకోవాలి మీరు. వీటికి ఇంగ్లీషులో ఆంత్రపోలజీ, కాస్మోజెనెసిస్ అని రెండు పేర్లు చెప్తాం.

సీక్రెట్ డాక్ట్రిన్ పుస్తకాలు గురించి అవగాహన ఉన్నవాళ్ళకి ఈ పేర్లు చెప్తున్నాను. ఫస్ట్ వాల్యూమ్‌లో కాస్మోజెనెసిస్ చెప్పబడింది. రెండవ దాంట్లో, ఆంత్రపోలజీ, మానవ జంతువు యొక్క పరిణామ క్రమము చెప్పబడింది.

✦ ఇవి రెండూ మీకు స్పష్టంగా అర్థమయినప్పుడు ధ్యానంలో జరిగేటటువంటి మార్పులు మీకు అర్థమవుతాయి. లేకపోతే ధ్యానంలో జరిగేటటువంటి మార్పులు మీకు అర్థంకావు.

❁ ధ్యానంలో వచ్చేటటువంటి పరిణామాలు మీకు రావు అని నేను చెప్పలేదు, అది అర్థం చేసుకోండి. మీకు అర్థంకావు అన్నానంతే. పరిణామం వస్తుంది. అర్థమయిందికదా!

పిల్లవాడు యువకుడవుతాడు, స్త్రీ యువతి అవుతుంది. పరిణామక్రమంలో జరిగిపోతోందది. మీకు అర్థం అవ్వాల్సిన పని లేదు. హార్మోన్స్ ఎలా సెక్రీట్ అవుతున్నాయో మనకి తెలియదు. అన్నం అరుగుతోంది, ఎన్ని ఎంజైమ్స్ వస్తున్నాయో, ఏయే సెంటర్ నుంచి, ఏయే ఎండోక్రైమ్ సిస్టమ్ నుంచి ఎన్ని రకాలైన హార్మోన్స్ రిలీజయితే మన శరీరంలో అన్నం అరుగుతోందో మనకి తెలియదు.

సైంటిస్ట్‌కి తెలుస్తాయి.

⇨ అలాగే ధ్యానాన్ని యోగవిద్యగా నేర్చుకున్నటువంటి వాళ్ళకి ఈ పుస్తకాలు చాలా అవసరం.

➡ కానీ యోగవిద్యగా మేం నేర్చుకోవక్కర్లేదు, మాకు ఆ పరిణామం వస్తే చాలు అనుకునేటటువంటి వాళ్ళు ధ్యానము

మానక్కర్లేదు. మీరు ధ్యానము చేసుకుంటూ వెళ్ళండి, దాని కొచ్చే ఫలితాలు గ్యారంటీగా వస్తాయి.

✦ ఇద్దరికీ ఒకేలాంటి ఫలితాలు వస్తాయి. ఒకడికి తెలిసి ఫలితాలు వస్తాయి, ఇంకొకడికి తెలియకుండా ఫలితాలు వస్తాయి.

అంచేత పుస్తకాలు చదివితేనే ఫలితాలు వస్తాయి అని నేను అనటంలేదు. కానీ ఫలితాలు ఎలా వస్తున్నాయి, మనం ఎక్కడ ఉన్నాము, ఎక్కడికెళుతున్నాము అనేది ఈ పుస్తకాలు చదివితే మీకు అర్థమవుతుంది.

**ఇంకొక విషయం చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి,**

నన్ను చాలా మంది ఈ ప్రశ్న అడిగారు. రేపు మీరు ధ్యానము ఇతరులకి చెప్తోన్నప్పుడు ఈ ప్రశ్న మీకు వేస్తారు. "మేము ఒక గురువు దగ్గర ధ్యానం పుచ్చుకున్నామండి, మరి ఆ ధ్యానం చేసుకోవాలా, ఈ ధ్యానం చేసుకోవాలా?"

**ఈ ప్రశ్న ఎందుకొస్తుందంటే,**

ధ్యానం అంటే ఏమిటో మీకు తెలియక.

మీరు ధ్యానం చేస్తున్నప్పుడు ఇప్పుడు, ఈ క్షణంలో నేను చెప్తోన్నటువంటి మాటలు చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి.

♠ మీరు నిజంగా ధ్యానం చేసినప్పుడు, మీరు ధ్యానస్థితిలోకి వెళ్ళిపోయినప్పుడు, ఆ ధ్యానస్థితిలోంచి బయటకి వస్తే తప్ప మీరు ధ్యానంలో ఉన్నారని మీకు తెలియదు.

అదొక స్థితి అది. మీరు ధ్యానం చేసుకుంటూ ఉంటే తలుపుకొట్టారనుకోండి ఎవరైనా, మీకు విన్పించిందనుకోండి, మీరు ధ్యానంలో లేరు. నటిస్తున్నారు. ప్రక్కవాళ్ళు ఏదో మాట్లాడుకుంటూ ఉంటే, డోన్ట్ డిస్టర్బ్ మీ, నేను ధ్యానం చేసుకుంటున్నాను అంటే, అసలు ధ్యానం కాదది.

✦ ధ్యానస్థితిలో ఉంటే బాంబులు పడ్డా మీ ధ్యానం చెదరదు. ఆ స్థితికి వెళ్ళాలి. ధ్యానం యొక్క మొదటి ఉద్దేశ్యం అది. అది మీరు గుర్తుంచుకోండి.

**అంటే ఏం చేయాలి?**

ధ్యానంలో కూర్చున్నప్పుడు బాహ్యాస్మృతి కోల్పోవాలి.

నిద్రలో కూడా బాహ్యాస్మృతి కోల్పోతాం.

**మరి రెండింటికి తేడా ఏమిటంటే,**

నిద్రాస్థితికి వెళ్ళినటువంటివాడు నిద్రపోవటానికి ముందు ఎలాగ ఉన్నాడో, నిద్రలేచిన తరవాత కూడా అలాగే ఉంటాడు. నిద్రపోయే ముందు వాడు ఏదో పుస్తకం చదువుతున్నాడనుకోండి, 14వ పేజీ చివరికి వచ్చాడు, నిద్రపట్టేసింది వాడికి. నిద్రలేస్తే మళ్ళా ఎక్కడ్నుంచి మొదలెట్టాల్సొస్తుంది వాడు? 15వ పేజీ మొదటి లైన్ నుంచి మొదలెట్టాల్సి వస్తుంది. అంతేకదా!

♠ కానీ ధ్యానస్థితిలోకి 14వ పేజీ చదువుతూ వెళుతోన్న వాడికి మరి ఆ పుస్తకం చదవాల్సిన పనిలేదు. మొత్తం పుస్తకం అర్థమయిపోతుంది వాడికి. అదీ తేడా.

✦ అలాగే ఏ ధ్యానం చేసుకోవాలనే ప్రశ్న అడక్కండి. ఏ ధ్యానం అయినా చేసుకోవచ్చు, రోజూ ధ్యానాలు మార్చుకోవచ్చు.

## కానీ మీరు ఎక్కడికెళ్ళాలి?

ధ్యానస్థితిలోకి వెళ్ళాలి.

♠ నిజమైనటువంటి ధ్యానస్థితిలోకి వెళ్ళిపోతే మీరు సర్వజ్ఞులై పోతారు, సర్వవ్యాపకులైపోతారు, సర్వసమర్థులైపోతారు.

♠ కానీ ఆ స్థితికి వెళ్ళక ముందు కూడా మొదటి రోజు నుంచి దాని ఫలితాలు మీకు రావటం మొదలెడతాయి. అది మీరు గుర్తుంచుకోండి.

ఇవి గుర్తుంచుకుంటూ మనం ధ్యానంలోకి వెళదాం.

☝ కళ్ళు మూసుకోండి, నిటారుగా కూర్చోండి. నేను కళ్ళు తెరవమన్నప్పుడు తప్ప ఇంక కళ్ళు తెరవకండి ఎవరూ కూడా.

☝ నేను ధ్యానము పూర్తయ్యేంత వరకు ఎట్టి పరిస్థితులలోనూ కదలను అని మనస్సులో 10, 15 సార్లు అనుకోండి. ఇంక కదలకండి, మొండికెత్తేయండి ఇంక.

ధ్యానము పూర్తయ్యేంత వరకు నేను ఎట్టి పరిస్థితులలోనూ కదలను అని మనస్సులో అనుకోండి. అది అలా రోజూ అనుకుంటూ ఉంటే, మెల్లిగా మీ సబ్‌కాన్సియస్ మైండ్‌లోకి ఈ సూచన వెళ్ళి పోతుంది. కొన్ని రోజులు మీకు ఇబ్బంది అవ్వచ్చుకాని, ఇలా అనుకోవటం వల్ల ఇంక మీరు కదలరు. ప్రతీ రోజు మీరు ధ్యానానికి కూర్చునే ముందు, కచ్చితంగా ఇలాగ కూర్చుని మనస్సులో 10, 15

సార్లు, ఇంకా వీలయితే ఇంకా చాలా సార్లు అనుకోండి. ధ్యానము పూర్తి అయ్యేంత వరకూ ఎట్టి పరిస్థితులలోను నేను శరీరాన్ని కదపను.

**మరి కదపకుండా శరీరాన్ని ఎలా ఉంచుకుంటాను?**

సమంకాయ శిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ (భ.గీ. 6-13)

(ధ్యానము చేయువాడు) శరీరము, శిరస్సు, కంఠము సమముగ (తిన్నగ) నిలిపి, కదలక, స్థిరముగ ఉండి, దిక్కులను జూడక, నాసికాగ్రమును వీక్షించవలెను.

ఈ శ్లోకం గుర్తుంచుకోండి.

స్ట్రెయిట్‌గా కూర్చుంటాను, శిరస్సు, మెడ, వెన్నుపూస నిటారుగా ఒకే లైన్‌లో ఉండేటట్టు ఉంచుకుంటాను. ఇంక ఈ పొజిషన్‌నుంచి ఎట్టి పరిస్థితులలోను నేను కదలను, నేను కదలను, నేను కదలను, నేను కదలను. బాగా మీ మనస్సుకి, బుర్రకి ఎక్కించండి. దానికి అర్థం అవ్వాలి, వీడు ధ్యానానికి స్ట్రెయిట్‌గా కూర్చుంటే, మొండివాడు, ఇంక ఏం జరిగినా కదలడు. మీరు రోజూ అనుకుంటే ఆ స్థితి వచ్చేస్తుంది మీకు.

**తరవాత ఏం చేయాలి?**

- మీ దృష్టిని శ్వాసమీద పెట్టుకోండి.

శ్వాస లోపలికి వెళుతోంది, బయటకు వస్తోంది. మీరు ప్రాణాయామం చేయటం లేదు. మంత్రజపం చేయకూడదు. శ్వాసను ఎక్కువగా పీల్చుకోవద్దు, తక్కువగా పీల్చుకోవద్దు. మామూలుగా

జరిగేటటువంటి శ్వాసను గమనించండి. శ్వాసను గమనిస్తూ ఇంకో మంత్రాన్ని 10, 15 సార్లు అనుకోండి. ఇందాక అనుకున్న మంత్రం ఏమిటి? ధ్యానం పూర్తయ్యేంత వరకూ శరీరాన్ని కదపను.

స్ట్రెయిట్‌గా కూర్చున్నాం, శ్వాసను గమనిస్తున్నాం.

**ఇప్పుడు ఇంకో మంత్రము,**

నిద్రలోకి వెళ్ళను, మత్తులోకి వెళ్ళను!
అత్యంత ఉత్సాహంతో శ్వాసను గమనిస్తాను!

నీరసం వద్దు, యాక్టివ్‌గా సక్రియంగా దాన్ని చెయ్యండి. చాలామంది మత్తులోకి వెళ్ళిపోయి మేము చాలా బాగా ధ్యానం చేశాం అనుకుంటారు. మీరు ఎట్టి పరిస్థితులలోనూ మత్తులోకి వెళ్ళకూడదు.

అంచేత నేను చాలా ఉత్సాహంగా ఏవిధమైనటువంటి మత్తులోకి వెళ్ళకుండా శ్వాసను గమనిస్తాను అనే మంత్రాన్ని 5, 6 సార్లు మనస్సులో అనుకోండి. శ్వాసను అతి ఉత్సాహంతో గమనిస్తాను, మత్తులోకి వెళ్ళను.

ఒకవేళ మత్తు వస్తే మిమ్మల్ని మీరు కాస్త కదుపుకుని మత్తులోంచి బయటపడండి. శ్వాసను గమనిస్తూ ఉండండి. శరీరాన్ని నిటారుగా ఉంచుకుని ఇంక నేను ధ్యానం పూర్తయ్యేంత వరకూ శరీరాన్ని కదపను! శ్వాసను గమనిస్తూ అతి ఉత్సాహంతో, మత్తులోకి వెళ్ళకుండా శ్వాసనే గమనిస్తాను! ఇది ధ్యానము యొక్క మొదటి చరణము.

**ఈ మొదటి చరణములో ఎంత లాభం వస్తుందంటే,**

- మీ అమ్మాయికి పెళ్ళి కాకపోతే ఇలా ధ్యానం చేస్తున్నటువంటి వాళ్ళమ్మాయికి పెళ్ళి అయిపోతుంది.

కాని ఈ రెండు కండిషన్స్ ఉండాలి. ధ్యానం యొక్క అరగంట టైమ్‌లో మీ శరీరం కదలకూడదు, శ్వాస మీద నుంచి మీ దృష్టి కదలకూడదు. ఉత్సాహంగా గమనించాలి. ఇది ఉంటే మీకు తీరనటువంటి కోరిక ఏదీ ఉండదు.

- ఆర్థిక పరిస్థితులు కరెక్ట్‌గా లేవు! కచ్చితంగా మీ ఆర్థిక పరిస్థితి దీనివల్ల నయం అవుతుంది.

ఈ గ్యారంటీ నేను కాదు ఇచ్చేది, మీకు చాలాసార్లు చెప్పాను, ఈ గ్యారంటీ భగవద్గీత యొక్క 6వ అధ్యాయంలో శ్రీకృష్ణుడే ఇచ్చాడు. ఇలా ఎవడైతే శ్వాసను గమనిస్తూ కూర్చుంటాడో, వాడికి ఏం వస్తుందట?

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే (భ.గీ. 6-22)

దేనిని పొందిన పిదప ఇతరమగు ఏలాభమును అంతకంటె గొప్పదానినిగా తలంపకుండునో, దేనియందున్నవాడై మహత్తర దుఃఖముచే గూడ చలింపకుండునో (అదియే ఈ యోగస్థితి).

ఇంతకంటే గొప్పదైనటువంటి లాభము నా జీవితంలో నేను పొందలేదు అని వాడికి అనుభూతి వస్తుంది. ఇది ఇంకా ధ్యానము యొక్క ప్రాథమిక చరణమే. మీరు ఇంకా ధ్యానములోకి ప్రవేశించ

లేదు. మీరు కేవలము రెండు నియమాలు పెట్టుకున్నారు. మెడ స్ట్రెయిట్‌గా ఉండాలి, వెన్నుపూస స్ట్రెయిట్‌గా ఉండాలి, శరీరాన్ని కదపను. రెండవ నియమం ఏం పెట్టుకున్నారు? నేను శ్వాసను చూస్తాను, శ్వాసను చూస్తోన్నప్పుడు మనస్సుని ఎక్కడికీ చెదరనివ్వను, మనస్సుని అతి ఏకాగ్రతతో ఉత్సాహంగా శ్వాసను గమనిస్తాను. దాన్ని గమనించుకోండి కొంచెంసేపు.

- మెల్లిగా మీ దృష్టిని ఆజ్ఞాచక్రం దగ్గరకు తీసుకెళ్ళండి. ఆజ్ఞాచక్రము అంటే మీ భృకుటి యొక్క స్థానము.

**అక్కడ దృష్టి ఉంటే ఏమవుతుంది?**

అక్కడ దృష్టి ఉన్నటువంటి వ్యక్తి తన జీవితంలో ఒక విశేషమైనటువంటి మానసికస్థితి పొందుతాడు.

**ఏమిటా మానసికస్థితి అంటే,**

శరణాగతి స్థితి.

నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాఽచ్యుత
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ. (భ.గీ. 18-73)

ఓ శ్రీకృష్ణా! నీ యనుగ్రహమువలన నాయజ్ఞానము నశించినది. జ్ఞానము (ఆత్మస్మృతి) కలిగినది. సంశయములు తొలగినవి. ఇక నీయాజ్ఞను నెరవేర్చెదను.

ఇంక నా జీవితంలో నా కోరిక అంటూ ఏమీ లేదు. హే ప్రభూ! హే గురుదేవా! నువ్వు ఏమి ఆజ్ఞ ఇస్తే నేను దాన్ని పాటిస్తాను అనేటటువంటి మానసికస్థితి వస్తుంది.

దాన్నే నిష్ఠ, సబూరి అన్నాడు సాయి.

- అంచేత ఆ బొట్టు పెట్టుకునే స్థానం వద్ద మీ మనస్సుని ఏకాగ్రం చేసుకుని అలా ఉండిపోండి.

ఇంక అక్కడ ఉండిపోవటమే మీరు. ఇంక మీరు చేసేదేం లేదు. జరిగేదేదో అక్కడ జరుగుతుంది, అది మీ చేతిలో లేదు, గురువు యొక్క అనుగ్రహంతో జరుగుతుంది. ఇంత వరకే మీరు చేయగలిగేది, అది గుర్తుంచుకోండి. మీ ప్రయత్నం ఇంత వరకే.

ఆజ్ఞాచక్రం దగ్గర మీ దృష్టిని నిలిపేసి, అక్కడ చూస్తూ ఉండండి. శ్వాసను పట్టించుకోకండి, నిద్రపోకండి, తూలకండి. స్ట్రయిట్‌గా కూర్చోండి, మెడ వంకర చేయకండి. సర్దుకోండి. కానీ దృష్టి మాత్రము ఆజ్ఞాచక్రం దగ్గరే ఉండాలి.

- ✦ సంపూర్ణ గురు అనుగ్రహం దీని వల్ల లభిస్తుంది, ముఖ్యంగా పూర్ణిమనాడు.

- ఇంక మీరు చేసేదేమీ లేదు. మంత్రజపం చేయకండి. ఏ రూపాలూ ఊహించుకోకండి. ఏమి కనిపించినా దాన్ని ప్రక్కకు తొయ్యకండి. మీరేం చేయరు, చూస్తూవుంటారంతే ఏం వచ్చినా, ఏం జరిగినా. ఆ లాజిక్ అర్థంచేసుకోండి.

ప్రయాణకాలే మనసాఽచలేన
భక్త్యా యుక్తో యోగబలేన చైవ
భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్
స తం పరం పురుషముపైతి దివ్యమ్. (భ.గీ. 8-10)

అట్టి పరమభక్తుడు అంత్యకాలమునందు యోగబలముచేత భ్రుకుటి మధ్యమున ప్రాణములను స్థిరముగా నిలిపి నిశ్చలమైన మనస్సుతో స్మరించుచు దివ్యస్వరూపుడును, పరమపురుషుడును అయిన పరమాత్మను పొందుచున్నాడు.

ఆ భ్రుకుడి మధ్య మీ చేతనత్వాన్ని, ప్రాణం అంటే చేతనత్వాన్ని, సమ్యక్, బాగుగా అక్కడ ఆవేశింపచేసి, మీ మనస్సుని అక్కడ ఉంచుకోవటమే. అదే ధ్యానప్రక్రియ అంటే. ఆ తరవాత జరిగేదేదో అదే జరుగుతుంది.

☝ అలాగ ఒక 20 నిమిషాల పాటు కూర్చోండి.

కానీ ఇప్పుడు మాత్రము మీరు 5 నిమిషాలే కూర్చోండి.

***ఎంచేతంటే,***

సామూహికంగా చేసేటటువంటి దానికి శక్తి ఎక్కువ ఉంటుంది. ఇంత మంది కలిసి చేస్తున్నప్పుడు అన్ని గంటలు మీరు కూర్చోవక్కర్లేదు, 5 నిమిషాలలోనే గంటలు గంటలు చేసేటటువంటి లాభం మీకు వస్తుంది.

మళ్ళీ నేను చెప్పేంత వరకు పరిపూర్ణమైనటువంటి ఏకాగ్రత మీ ఆజ్ఞాచక్రం దగ్గర ఉంచుకోండి.

మనస్సు చెదరనివ్వకండి. క్వాలిటీ డెవలప్ చేసుకోండి. ప్రయత్నిస్తే వచ్చేస్తుంది. సంపూర్ణ శరణాగతి ఆ బిందువు దగ్గర. దాన్నే లాహిరీ మహాశయ కూటస్థ చైతన్యము అన్నాడు. ఇంక అక్కడ మీ మనస్సు ఉంటే మీరు చేసేదేం లేదు, చేసేదేదో అదే చేస్తుంది.

